క్లుప్తంగా

పందిరిరాట మహోత్సవం



పందిరిరాట వేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని తుమ్మావీధి లోమెహెర్ బాబా మందిరం వద్ద వినాయక చవితి సందర్భంగా గురువారం పందిరిరాట వేశారు. ఈ నెల 27 నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నామని, అందరూ పాల్గొనాలని డబ్బీరు సుమంత్ పట్నాయక్ కోరారు.

కవితా యోధుడు రవీంద్రుడు



రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గార: భారతీయుల కీర్తి కిరీటం, జనగణమన జాతీయ గేయ రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ కవితా యోధుడని కె.మత్స్యలేశం సర్పంచ్ బి.లలిత అన్నారు. గురువారం విశ్వకవి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో బ్రిటీష్ పాలకులపై కొందరు యోధులు కత్తులు, తుపాకులతో పోరాడితే.. రవీంద్రుడు కవితలతో పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బి.ఎర్రన్న, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, బత్తుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా విజేతలకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ట్రిపుల్ఐటీ అధికారులు

ఎచ్చెర్ల : స్థానిక రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం విద్యార్థులు ఇటీవల నరసన్నపేటలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో అద్భుతమైన ప్రదర్శన చేసి బంగారు, రజత పతకాలు సాధించారని డైరెక్టర్ బాలాజీ తెలిపారు. వీరిని గురువారం క్యాంపస్‌లో అభినందించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, యోగా విభాగాధిపతి ఈశ్వరరావు, యోగా అధ్యాపకులు అర్చన, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ వితరణ

రణస్థలం: రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోటరీ క్లబ్ ఆఫ్ సైబరాబాద్ ప్రతినిధి పిసిని వెంకట్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను వితరణగా అందజేశారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయంలో రోగికి ఆక్సిజన్‌ను అందించడానికి కాన్సన్‌ట్రేటర్ ఉపయోగపడుతుందన్నారు. కొవ్వాడ, ఎన్‌జీఆర్ పురం పాఠశాలకు కంప్యూటర్లు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సాగులో సాంకేతికత అవసరం

ఎచ్చెర్ల : రైతులకు ప్రకృతి వ్యవసాయంలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో తెలియజేయాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం పూజారి సత్యనారాయణ అన్నారు. గురువారం కేశవరావుపేట రైతు భరోసా కేంద్రం వద్ద డివిజన్ స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రీజనల్ అధికారి హేమసుందర్, శ్రీనివాస్, లక్ష్మీనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత వస్త్రధారణతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చేనేత వస్త్రధారణతో ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని, అదే సమయంలో చేనేత కార్మికులకు అండగా ఉంటూ ప్రోత్సహించవచ్చని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో 11వ జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేతన్న భరోసా కింద రూ.25 వేలు, నేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ కల్పించడానికి క్యాబినెట్ ఆమోదించిందన్నారు. నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ రమేష్ కృష్ణ మాట్లాడుతూ 500 మంది చేనేత కార్మికులతో ఉత్పత్తి సంఘం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం పలువురు చేనేత ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాలలో ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సన్యాసిరావు, హ్యాండ్లూమ్స్ ఏడీ టి.జనార్దన్‌రావు, రెడ్ క్రాస్ సెక్రటరీ జగన్మోహన్‌రావు, ఇంటాక్ ప్రతినిధి జగన్నాథరావు నాయుడు, వివిధ చేనేత సొసైటీల ప్రతినిధులు కృష్ణారావు, కె.ప్రసాద్, కె.రవి, ఎం.గణపతిరావు, కె.కృష్ణారావు, కె.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం!



కూరగాయల దుకాణం

- ఘాటెక్కిన మిరప
- దిగిరానంటున్న టమాట
- రెండింతలు పెరిగిపోయిన కూరగాయల ధరలు
- చేపలదీ అదేదారి

శ్రీకాకుళం : కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జూలై మొదటి వారం ధరలతో ప్రస్తుత ధరలను బేరీజు వేసుకుంటే దాదాపు రెండు రెట్లు పెరిగాయి. దీంతో సామాన్యుడు మార్కెట్‌కు వెళ్లాలంటేనే వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి వచ్చింది. గత నెల కిలో మిరపకాయల ధరలు రూ.40 ఉంటే ప్రస్తుతం ఆ ధర రూ.100కు చేరింది. 25 కిలోల టమాటా ట్రే ధర అప్పట్లో రూ.450 నుంచి రూ.550 వరకు పలకగా, ప్రస్తుతం రూ.1200 చేరింది. రిటైల్‌గా కిలో టమాటా రూ.55 నుంచి రూ.60కు విక్రయిస్తున్నారు. కిలో అల్లం ధర నెల రోజుల క్రితం రూ.40 ఉండగా ఇప్పుడు 80 రూపాయలకు చేరింది. కిలో క్యాప్సికం జూలైలో 50 విక్రయించగా ప్రస్తుతం రూ.90 పలుకుతోంది. బీన్స్ రూ.40 నుంచి రూ.120కు చేరింది. గత నెల కిలో క్యారెట్ రూ.25 నుంచి రూ.30 అమ్మేవారు. ప్రస్తుతం అది 50 రూపాయలకు చేరుకుంది. ఇలా ప్రతి కూరగాయ ధర కిలోకి రూ.20 నుంచి 30 వరకు పెరిగిపోయాయి. ప్రస్తుతం కిలో వంకాయలు రూ.55, బీరకాయలు రూ.60, క్యాబేజీ రూ.45, దొండకాయలు రూ.50, బెండకాయలు రూ.50 అమ్ముతున్నారు. రైతుబజార్ ధరలతో పోలిస్తే కూరగాయల మార్కెట్లో ధర మరికొంత ఎక్కువే. కిలో ఉల్లిపాయలు ధర కూడా రూ.40కు చేరుకుంది.

వర్షాభావ పరిస్థితులతో..

కూరగాయల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు అవస్థలు పడుతున్నారు. వాస్తవానికి వర్షాకాలంలో కూరగాయల ధరలు తగ్గడం పరిపాటి. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కూరగాయల దిగుబడి తగ్గిపోయిందని, ఇతర జిల్లాల నుంచి రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈ ధరలు మరింత పెరిగే అవకాశాలున్నట్లు అభిప్రాయపడుతున్నారు.

చేపల ధరలు పైపైకి..

చేపల ధరలు కూడా రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు చేపల వేట నిషేధం ఉండడంతో ఆయా రోజుల్లో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటూ ఉండటం వల్ల ధరలు ఎక్కువగా ఉంటాయి. జూన్ 20 నుంచి చేపల ధరలు తగ్గుతూ వచ్చి ఆగస్టు నెలాఖరుకు బాగా తగ్గుతుంటాయి. ఈ ఏడాది మాత్రం వేట నిషేధం ఉన్న రోజుల్లో కంటే అధిక ధరలకు చేపలను అమ్ముతున్నారు. ప్రస్తుతం కిలో పంజరం రూ.700 నుంచి రూ.750, కిలో రొయ్యలు సైజును బట్టి రూ.250 నుంచి రూ.700 వరకు అమ్ముతున్నారు. కిలో తెల్ల చందువా ధర రూ.1200 నుంచి రూ.1500 పైమాటే. సముద్రంలో 10 కిలోమీటర్ల తరువాత పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంటుందని, ఈ కారణంగా లోపలి వరకు వెళ్లి వేట చేయలేకపోతున్నామని మత్స్యకారులు చెబుతున్నారు. తరచూ వాతావరణంలో వస్తున్న మార్పులతో అధికారుల హెచ్చరికల మేరకు వేటకు వెళ్లలేకపోవడంతో దిగుబడి తగ్గి ధరలు పెరగడానికి కారణం అవుతున్నాయని అంటున్నారు. సముద్రపు చేపల ధరలు పెరగడం వల్ల దీనిని ఆసరాగా చేసుకొని చేపలు రొయ్యలు పెంచుతున్న వ్యాపారులు సైతం ధరలను అమాంతం పెంచేశారు. వీటిని నియంత్రించాల్సిన ప్రభుత్వ అధికారులు కనీసం ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని ధరలు అదుపులో ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

కొనలేకపోతున్నాం



కూరగాయల ధరలు బాగా పెరిగిపోవడంతో సామాన్యులపై పెనుభారం పడుతోంది. గతంలో అరకేజీ కొంటే ప్రస్తుతం పావు కేజీతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఇతర నిత్యావసర సరుకుల ధరలు కూడా బాగా పెరిగిపోయాయి.

– లీలావతి, గృహిణి, శ్రీకాకుళం

ధరాభారం..



ధరలన్నీ పెరిగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. జూలై, ఆగస్టు నెలల్లో పిల్లలకు స్కూలు ఫీజులు ఇతర అవసరాలకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇటువంటి తరుణంలో కూరగాయల ధరలు పెరగడంతో మరింత ఆర్థిక భారం పడుతోంది.

తిరుమలరావు, ప్రైవేట్ ఉద్యోగి, శ్రీకాకుళం

అడుగడుగునా నిర్లక్ష్యం.. పొంచి ఉన్న ప్రమాదం!



కల్వర్టు వద్ద కానరాని హెచ్చరిక బోర్డులు

- పెదపాడు ఫ్లై ఓవర్‌బ్రిడ్జి సమీపంలో కల్వర్టు నిర్మాణం
- కానరాని ప్రమాద హెచ్చరిక బోర్డులు
- దూసుకొస్తున్న వాహనచోదకులు



కల్వర్టును అనుసరించి వాహనాల రాకపోకలు

శ్రీకాకుళం రూరల్ : పెదపాడు ఫ్లై ఓవర్ బ్రిడ్జి పరిసర ప్రాంతంలో జరుగుతున్న కల్వర్టు నిర్మాణం వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు గానీ, బారికేడ్లు గానీ ఏర్పాటు చేయకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. దాదాపు పది అడుగుల లోతులో నిర్మిస్తున్న ఈ కల్వర్టుకు చుట్టుపక్కలా ఎటువంటి రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనచోదకులు గమనించక కల్వర్టు వరకూ దూసుకుపోతున్నారు. అక్కడికి వచ్చాక సడన్ బ్రేక్ వేయడంతో హైరానా పడుతూ కొన్నిసార్లు స్వల్ప ప్రమాదాలకూ గురవుతున్నారు. చుట్టుపక్కలా మెటీరియల్ ఉన్నంత వరకూ కాస్త పర్వాలేకపోయినా కొన్నిసార్లు మెటీరియల్ లేనప్పుడు మాత్రం నిర్మాణం జరుగుతున్న సంగతి తెలియక వాహనచోదకులు అయోమయానికి గురుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులేవీ?



నేను నిత్యం నరసన్నపేట నుంచి శ్రీకాకుళం రాకపోకలు చేస్తుంటాను. కల్వర్టు పనులు జరుగుతున్న విషయం చాలామందికి తెలియక నిర్మాణం దగ్గర వరకు వచ్చేస్తున్నారు. ఈ సమయంలో ఏమాత్రం ఏమరుపాటు వహించినా ప్రమాదం తప్పదు. అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– ఆర్.సత్యం, నరసన్నపేట

అవే ఆధారం..



కల్వర్టు పనులు జరుగుతున్న ప్రాంతంలో ఇసుక కుప్పలు, కాంక్రీట్ చిప్స్ ఉండటంతో పనులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కోసారి ఇవి కుడా ఉండవు. అలాంటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. కల్వర్టు జరుగుతున్న ప్రాంతమంతా బారికేడ్లు ఏర్పాటు చేయాలి.

– వి.హర్షవర్ధన్, శ్రీకాకుళం

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం పట్టణ అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణయాదవ్ తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారం నేపథ్యంలో బుధవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ గూండాల మూకుమ్మడి దాడి హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం పట్టణ అధ్యక్షుడు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణయాదవ్ అన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను గాయపరచడం దారుణమన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇటువంటి భౌతిక దాడులు తగదని, నిందితులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయాలని చూస్తే ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ బీసీ సంఘం అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణయాదవ్, జిల్లా అఖిల భారతీయ యాదవ మహాసభ ఆహీర్ ప్రధాన కార్యదర్శి గురు రవియాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రాము, మట్ట రమణ, ఇద్దిబోయిన యుగంధర్ యాదవ్, అప్పలరాజు యాదవ్, ఈది శ్రీనివాస్ యాదవ్, అల్లబోయిన అప్పన్న యాదవ్, జన్నెల నిఖిత యాదవ్, రౌతు సూర్యనారాయణ, నక్క దేవానంద తదితరులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడటం సరికాదు..

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ రౌడీలు, గూండాలు దాడులకు పాల్పడడం సరికాదని వైఎస్సార్ సీపీ బీసీ సంఘం నగర ప్రధాన కార్యదర్శి రౌతు సూర్యనారాయణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ఓటమి భయంతోనే ఇటువంటి కక్షపూరిత దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. హామీలను అమలు చేయకుండా దాడులు, కేసులతో ప్రతిపక్ష నాయకులను భయభ్రాంతులను చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. అన్యాయం జరిగితే ప్రశ్నించడానికి ముందుంటానన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కక్షపూరిత రాజకీయాలను మానుకొని ప్రశాంత వాతావరణం నెలకొనేలా హోంమంత్రి చర్యలు చేపట్టాలని కోరారు. కడప ఘటనలో దోషులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న బెటాలియన్ పోలీసులు

ఎచ్చెర్ల: భూతాపాన్ని తగ్గించి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు సమాజంలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఐఆర్ ఏపీఎస్‌పీ 1వ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్.వి.ఎస్.పద్మనాభరాజు అన్నారు. గురువారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల పోలీసు క్వార్టర్స్ వద్ద ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.నాగేశ్వర రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు టి.నాగశ్రీనివాసరావు, ఎం.గోపాలకృష్ణ, ఆర్ఐలు, సిబ్బంది, విద్యార్థులుపాల్గొన్నారు.

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని, అందుకు న్యాయవాదులు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని 3వ అదనపు జిల్లా జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, 4వ అదనపు జిల్లా జడ్జి ఎస్ఎం ఫణికుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.హరిబాబు కోరారు. జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించాలన్నారు. సమావేశంలో బార్ అధ్యక్ష, కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్ట దామోదర్‌రావు, పలువురు న్యాయవాదులు, బార్ కౌన్సిల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా నైరా వ్యవస్థాపక దినోత్సవం



అతిథులను సన్మానిస్తున్న కళాశాల అధికారులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా వ్యవసాయ కళాశాల 36వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.జోగినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాల కోసమే కాకుండా రైతులకు ఉపయోగపడేలా కోర్సులు చదవాలన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి, గ్రీన్ మార్నింగ్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అప్పారీ రామచంద్ర మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులు ఉద్యాన పంటల రంగాలలో ఎలా రాణించవచ్చో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఐసీఆర్, సీఆర్ఆర్ఐ డాక్టర్ బి.బి.పండా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం కళాశాల ఓఎస్ఏ డాక్టర్ ఎస్.గోవిందరావు, డాక్టర్ పి.గురుమూర్తి, ఉపేంద్రరావు, పి.సీతారామ్, చిన్నంనాయుడు, డాక్టర్ ఎల్.సూర్యనారాయణ, గురువారెడ్డి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీపై దాడి అమానుషం

శ్రీకాకుళం పాతబస్టాండ్: పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యహితంగా ప్రచారం చేస్తున్న శాసన మండలి సభ్యుడు రమేష్‌యాదవ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది హేయమైన చర్య అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదర్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటి చర్యలకు పాల్పడటం, ప్రోత్సహించడం సరికాదన్నారు. ఈ ఘటనపై గవర్నర్, ఉన్నత న్యాయస్థానాలు సుమోటోగా తీసుకొని నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వరలక్ష్మీ వ్రతాలకు సర్వం సిద్ధం



పూలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

- కిటకిటలాడిన మార్కెట్లు
- కళకళలాడిన బంగారం దుకాణాలు

శ్రీకాకుళం కల్చరల్/జి.సిగడాం: శ్రావణమాసంలో కీలకమైన వరలక్ష్మీ వ్రతానికి మహిళలు సిద్ధమయ్యారు. శుక్లపక్ష పౌర్ణమికి ముందువచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతం చేయడం ఆనవాయితీగా వస్తుండటంతో ఆలయాలు, గృహాలు ముస్తాబయ్యాయి. వ్రతానికి అవసరమయ్యే పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు జనం పెద్ద ఎత్తున జిల్లా కేంద్రానికి రావడంతో మార్కెట్లు కిటకిటలాడాయి.

– అమ్మవారికి ఇష్టమైన బొబ్బట్లు, బూరెలు, చిట్టి బూరెలు, గారెలు, కజ్జికాయలు, పులిహోర, పులగం, పాయసం, రవ్వలడ్డులు తదితర తొమ్మిది రకాల పిండి వంటలు మన సంప్రదాయానికి నిదర్శనాలు. వాటిని నైవేద్యంగా సమర్పించనున్నారు.

- వరలక్ష్మీ వ్రతం రోజున అమ్మవారిని కలశ పెట్టి నిండుగా బంగారం, పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు.
- మార్కెట్లో పత్రికి గిరాకీ నెలకొంది. కొబ్బరికాయ ఒకటి రూ.40, బత్తాయి, సీతాఫలం, ఆపిల్, దానిమ్మ కేజీ రూ.250 నుంచి రూ.350 వరకు ధర పలికాయి. అరటిపండ్లు డజను సైజు బట్టి రూ.150 విక్రయించారు.



ప్రత్యేక అలంకరణలో శ్రావణలక్ష్మి



బంగారం కొనుగోలు చేస్తున్న మహిళలు

- పూజకు పూలు తప్పనిసరి కావడంతో రేట్లు అమాంతం పెరిగాయి. బంతిపూలు కేజీ రూ.500, చామంతులు రూ.700 పలికాయి. గులాబీలు కేజీ రూ.600 అమ్ముతున్నారు. లిల్లీపూలు, మల్లెపూలు మూర రూ.100 అమ్ముతున్నారు. మొగిలిపువ్వు ఒక్కొక్కటి రూ100 చొప్పున విక్రయించారు. పట్టణంలోని బంగారం షాపులు సైతం కళకళలాడాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఎచ్చెర్ల : సైబర్ నేరాలపై అప్రమత్తంగా లేకుంటే దుండగులు కష్టార్జితం దోచుకుంటారని జేఆర్‌పురం సీఐ అవతారం అన్నారు. గురువారం ఎచ్చెర్ల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఆధ్వర్యంలో జన సురక్ష, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ పైడి రాజా, లీడ్‌బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు, ఎచ్చెర్ల ఎస్సై సందీప్‌కుమార్, రీజనల్ డైరెక్టర్ రాంజీ, ఎచ్చెర్ల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శేషగిరి, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

గార: బాల్య వివాహాలతో ఆరోగ్యకరమైన ఇబ్బందులు ఏర్పడతాయని, చట్టరీత్యా నేరమని గార ఎస్ఐ సీహెచ్.గంగరాజు అన్నారు. గురువారం సతివాడ జెడ్పీ హైస్కూల్‌లో నారీశక్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటిని ఎదుర్కొనే విధానాలను వివరించారు. సైబర్ క్రైమ్, పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ముద్దాడ గౌరిశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

జి.సిగడాం: జీవితాన్ని నాశనం చేసే మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని జి.సిగడాం ఎస్ఐ వై.మధుసూదనరావు అన్నారు. గురువారం కొత్తపెంట గ్రామంలో నారీశక్తి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వాహన నిబంధనలు, సైబర్ నేరాలు, పలు చట్టాలపై అవగాహన కల్పించారు.

న్యాయవాదులకు క్విజ్ పోటీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆగస్టు 15 పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు ఆగూరు ఉమామహేశ్వరరావు, కొంక్యాణ సుభాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 60 మంది న్యాయవాదులు పాల్గొన్నారు. పైడి జోగారావు జట్టు ప్రథమ, కుసుమ జట్టు ద్వితీయ స్థానాలు సాధించాయి. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్, కార్యదర్శి పిట్టా దామోదరరావు, మాజీ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.